క్లుప్తంగా

మూల పెద్దమ్మకు ప్రత్యేక పూజలు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

గడివేముల: స్థానిక మూల పెద్దమ్మ ఆలయంల మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలిరావడంతో ఆలయం కిక్కిరిసింది. వేకువజాము నుంచే భక్తులు ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకున్నారు.

పింఛన్ల సొమ్మును సద్వినియోగం చేసుకోండి

- జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా



పింఛన్లు పంపిణీ చేస్తున్న కలెక్టర్ రంజిత్‌బాషా, ఎమ్మెల్యే చరిత

ఓర్వకల్లు: పింఛన్ల సొమ్మును సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా సూచించారు. మంగళవారం మండలంలోని నన్నూరు గ్రామంలో ఎమ్మెల్యే గౌరు చరితతో కలిసి కలెక్టర్ ఇంటింటికి వెళ్లి లబ్ధిదారులకు పింఛన్ సొమ్మును అందజేశారు. ఈ సందర్భంగా వారు ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసులు, తహసీల్దార్ విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

బైరాపురం మహిళ ప్రతిభ



ప్రథమ స్థానంలో నిలిచిన బైరాపురం నీలవేణి

ఓర్వకల్లు: ఇటీవల యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన చిత్రలేఖనం పోటీల్లో బైరాపురం గ్రామానికి చెందిన నీలవేణి రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిందని ఎంపీడీఓ శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా, సెట్కూర్ సీఈఓ వేణుగోపాల్ చేతుమీదుగా బహుమతి అందుకున్నట్లు ఎంపీడీఓ తెలిపారు.

ప్రజల సహకారంతోనే అభివృద్ధి



కంబదహాల్ గ్రామసభలో మాట్లాడుతున్న పీఎస్ అభిషేకం

సి.బెళగల్: ప్రజల సహకారంతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందని కంబదహాల్ గ్రామ పంచాయతీ కార్యదర్శి (పీఎస్) అభిషేకం అన్నారు. మంగళవారం గ్రామ సచివాలయంలో సర్పంచ్ చిన్న ఈరమ్మ అధ్యక్షతన వివిధ అభివృద్ధి పనులపై గ్రామసభ నిర్వహించి చర్చించారు.

గోర్బోలి భాషను రాజ్యాంగంలో చేర్చాలి

కర్నూలు(అర్బన్): దేశంలోని అన్ని రాష్ట్రాల్లో నివశిస్తున్న బంజరాలు మాట్లాడే గోర్బోలి భాషకు రాజ్యాంగ హోదా కల్పిస్తూ రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్‌లో చేర్చేంత వరకు ఉద్యమాలు చేస్తుంటామని లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.కైలాస్‌నాయక్ స్పష్టం చేశారు. ఎల్‌హెచ్‌పీఎస్ ఆవిర్భవించి 29వ సంవత్సరంలోకి అడుగుపెట్టిన సందర్భంగా మంగళవారం స్థానిక బిర్లా కాంపౌండ్‌లోని బంజారా కార్యాలయంలో ఘనంగా జెండాను ఆవిష్కరించి, కేక్ కట్ చేసి పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కైలాస్ నాయక్ మాట్లాడుతూ.. గోర్బోలి భాషకు రాజకీయ హోదా కల్పించేందుకు చేపట్టాల్సిన భవిష్యత్ కార్యక్రమాలపై చర్చిస్తున్నామన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడచినా, గిరిజనుల బతుకులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న విధంగా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. గిరిజనులకు సంక్షేమ పథకాలను అమలు చేయాలని, ట్రైబల్ వెల్ఫేర్ కార్పొరేషన్‌కు నిధులు మంజూరు చేయాలని కోరారు. ఆర్‌యూ మాజీ వీసీ ఎన్‌టీకే నాయక్, పోస్టల్ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు నాగరాజునాయక్, నాయకులు సోమ్లానాయక్, రామాంజులునాయక్, జీవీఎస్ రాజునాయక్, బాలు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

కర్నూలు(సెంట్రల్): జూలై 9వ తేదీన దేశ వ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ నగర అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.నరసింహులు, సీహెచ్ సాయిబాబా పిలుపునిచ్చారు. శుక్రవారం కల్లూరు ఇండస్ట్రియల్ ఎస్టేట్ హమాలీ యూనియన్ కార్మికుల విస్తృత స్థాయి సమావేశంలో వారు మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్రాల్లోని కూటమి ప్రభుత్వాలు కార్మికులపై నిరంకుశ వైఖరిని అవలంభిస్తున్నాయని ఆరోపించారు. 1986లో అమెరికాలోని చికాగో సమావేశంలో సాధించుకున్న 8 గంటల పని విధానానికి స్వస్తి చెప్పడం అన్యాయమన్నారు.

కౌలు రైతు కుదేలు!

- రుణాల పంపిణీలో ప్రభుత్వం వెనుకంజ
- సాగు హక్కు పత్రాల జారీలోనూ నిర్లక్ష్యం



సోయాబీన్ పంటకు మందును పిచికారీ చేస్తున్న అన్నదాత

గడివేముల: కౌలురైతుల కష్టాలపై సర్కారు కనికరం చూపడంలేదు. వారి అవసరాలపై దృష్టి సారించడం లేదు. బ్యాంకుల నుంచి ఆశించిన స్థాయిలో రుణాలు ఇవ్వకపోవడంతో పెట్టుబడులకు ఇబ్బంది పడుతున్నారు. ప్రకృతి విపత్తుల కారణంగా దెబ్బతిన్న పంటలకు పరిహారం అందక నష్టపోతున్నారు. కౌలుకు భూమి సాగు హక్కు పత్రాలు (సీసీఆర్‌సీ) పొందలేక భూములు సాగు చేయలేని పరిస్థితుల్లో కౌలుదారులు కాలం వెళ్లదీస్తున్నారు. దీనికి తోడు మండలంలో కౌలుదారులకు గత ఏడాది సాగు చేసిన భూమికి అధికారులు సీసీఆర్ కార్డులు జారీ చేశారు. వాస్తవానికి కౌలుదారుడు ఈ ఏడాది మరొక భూమిని సాగు చేస్తున్నారు. దీంతో ప్రభుత్వపరంగా అందే రాయితీలు సైతం కౌలురైతు కోల్పోతున్నారు. గడివేముల మండలంలో 1,059 మందికి సీసీఆర్ కార్డులు అందాలని లక్ష్యంగా నిర్దేశించారు. ఇప్పటి వరకు వంద మందికి అందజేసినట్లు వ్యవసాయాధికారులు చెబుతున్నారు. పంట సాగు హక్కు పత్రం కలిగిన కౌలు రైతులకు ఏపీ పంట సాగు హక్కు చట్టం -2019ని సెక్షన్3(2), 8(ఏ) ప్రకారం 11 నెలల కాల పరిమితికి రెండు పంట సీజన్లకు సరిపడేలా కార్డు అందజేస్తున్నారు.

సాయం ఎప్పుడు అందుతుందో..

పంట రుణాలు, బీమా, విత్తనాలు, వ్యవసాయ పనిముట్ల పంపిణీలో సబ్సిడీ, పంటనష్ట పరిహారం వంటివి కౌలుదారుడికి సక్రమంగా అందడంలేదు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అందించే రైతు భరోసా పథకాన్ని కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవగా పేరు మార్చింది. ఈ పథకం విధి విధానాలు, మార్గదర్శకాలు ఖరారు చేయలేదు. ఇంకా పథకం అమలు చేయలేదు. దీంతో కౌలు రైతులు ఆందోళన చెందుతున్నారు. రూ.లక్షలోపు పంట రుణాలను సున్నా వడ్డీకే గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందించేది. తీసుకున్న రుణం ఏడాదిలోపు తిరిగి చెల్లించిన రైతులకు సున్నా వడ్డీ వర్తింపజేసేవారు. పంట రుణాలకు రైతు చెల్లించాల్సిన మూడు శాతం వడ్డీ భారాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరించి రైతులకు సున్నా వడ్డీ అందించేది. దీనిపై ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఏవిధమైన నిర్ణయం వెల్లడించలేదు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ కౌలు రైతులకు కూబి వైఎస్సార్ రైతు భరోసా పథకం అదించేవారు. ఇప్పుడు అన్నదాత సుఖీభవ పథకం కౌలు రైతులకు అందిస్తారా? లేదా అన్నదీ వేచి చూడాల్సిందే.

మూడెకరాలు కౌలుకు సాగు చేస్తున్న



ఒక్కో ఎకరా రూ.22 వేల చొప్పున మూడు ఎకరాలు కౌలుకు తీసుకుని మొక్కజొన్న సాగు చేశాను. ప్రస్తుతం వర్షం కురవకపోవడంతో పంట దెబ్బతినే పరిస్థితి ఉంది. కొన్ని రోజులుగా వర్షం పడకపోగా ఎండలు అధికంగా ఉండటంతో పంట అక్కడక్కడా వాడుపట్టింది. ఇలాగే వాన రాకపోతే మొక్కలు చనిపోయే పరిస్థితి ఉంది. మాలాంటి కౌలు రైతుల్ని ప్రభుత్వం ఆదుకోవాలి.

– కుమ్మరి రాజు, కౌలు రైతు, గడివేముల

వాలీబాల్ కిట్ల పంపిణీ

కర్నూలు (టౌన్): స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో మంగళవారం వాలీబాల్ క్రీడాకారులకు స్పోర్ట్స్ కిట్లు పంపిణీ చేశారు. జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు పాల్గొని పత్తికొండ, దేవనకొండ, డోన్, గూడూరు మండలాలకు చెందిన వాలీబాల్ క్రీడాకారులకు కిట్లను అందజేశారు. జిల్లా వాలీబాల్ సంఘం కార్యదర్శి అహ్మద్ షరీఫ్, వాలీబాల్ కోచ్ రవి రాజేష్ పాల్గొన్నారు.

మందుబాబులకు జరిమానా

కర్నూలు (టౌన్): మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన మందుబాబులకు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ జరిమానా విధించారు. ట్రాఫిక్ సీఐ మన్సూరుద్దీన్ ఆధ్వర్యంలో ట్రాఫిక్ పోలీసులు వివిధ ప్రాంతాల్లో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 70 మందిపై కేసులు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచారు. న్యాయమూర్తి వారందరికీ రూ.5 వేలు ప్రకారం మొత్తం రూ.3.50 లక్షలు జరిమానా విధించినట్లు ట్రాఫిక్ సీఐ వెల్లడించారు.

క్యాన్సర్‌పై ప్రజలకు అవగాహన అవసరం



ఎన్‌సీడీ-సీడీ వ్యాధులపై అవగాహన పోస్టర్లు ఆవిష్కరిస్తున్న వైద్యులు

కర్నూలు(రూరల్):క్యాన్సర్‌పై ప్రజలకు అవగాహన అవసరమని రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమ సమన్వయకర్త డాక్టరు మహేశ్వర ప్రసాద్ అన్నా రు. మండల పరిధిలోని ఇ. తాండ్రపాడు గ్రామం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఎన్‌సీడీ–సీడీ వ్యాధులపై స్క్రీనింగ్ పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ క్యాన్సరు వ్యాధి ప్రమాదకరమన్నారు. 30 సంవత్సరాలు దాటిన వారందరికీ అసంక్రమిత వ్యాధులైన రొమ్ము క్యాన్సర్, నోటి క్యాన్సర్, గర్భశయ, ముఖ ద్వార క్యాన్సరు తదితర వాటి గుర్తింపునకు ఆరోగ్యపరీక్షలు చేయాలన్నారు. వివరాలను ఎన్‌సీడీ 3.0 యాప్ లో నమోదు చేయలన్నారు. 18 ఏళ్ల దాటిన వారికి రక్తపోటు, మధుమేహం, రక్తహీనత పరీక్షలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు మంజుష, మనోజ్ కుమార్, ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ సుధాకర్, మల్లిఖర్జున తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి అదృశ్యం

గడివేముల: మండల పరిధిలోని పెసరవాయి గ్రామానికి చెందిన పదో తరగతి విద్యార్థి జశ్వంత్ అదృశ్యమైనట్లు ఎస్‌ఐ నాగార్జున రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ జశ్వంత్ మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో పదో తరగతి చదువుతున్నాడన్నారు. సోమవారం పాఠశాలకు వెళ్లి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ లేకపోవడంతో తమను ఆశ్రయించారన్నారు. విద్యార్థి తల్లి శ్రీలేఖ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఎల్లమ్మకు ప్రత్యేక పూజలు

కర్నూలు(రూరల్): నగర సమీపంలోని వెంకాయపల్లె ఎల్లమ్మకు మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. వేకువజాము నుంచే అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు క్యూ కట్టారు. కుంకుమార్చన ఆకుపూజ చేసి మొక్కులు తీర్చుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి భారీగా తరలివచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది.

గూడూరు ఎస్‌ఐపై ఫిర్యాదు

కోడుమూరు రూరల్ : మద్యం షాపు నుంచి నెలవారి మామూలు ఇవ్వలేదన్న కారణంతో గూడూరు ఎస్‌ఐ తిమ్మయ్య తనను అకారణంగా కొట్టాడంటూ మద్యం షాపు నిర్వహకుడు, అధికార పార్టీనాయకుడు సంగాల మధు కోడుమూరు సీఐ తబ్రేజ్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. దీనిపై సదరు సీఐ మాట్లాడుతూ సంగాల మధు అనే వ్యక్తి జూన్ 29వతేదీ రాత్రి తన బంధువైనటువంటి ఓ మహిళపై దాడి చేశాడన్నారు. ఆ మహిళ ఫిర్యాదు మేరకు అతడిని గూడూరు ఎస్‌ఐ స్టేషన్‌కు పిలిపించి దండించాడే కాని మద్యం షాపు నుంచి నెలవారి మామూళ్ల కోసం కాదని సీఐ వివరణ ఇచ్చారు.

తొలి రోజు 92 శాతం పింఛన్ల పంపిణీ

సి.బెళగల్: మండలంలో మొదటి రోజు 92 శాతం మందికి పింఛన్లు పంపిణీ చేసినట్లు మండల పరిషత్ కార్యాలయ పరిపాలన అధికారి శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం వివిధ గ్రామాల్లో సైతం ఉద్యోగులు పింఛన్ దారుల ఇళ్లకు వెళ్లకుండ సచివాలయాల్లో, వీధి చివర, ఆలయాల పరిసరాల్లో, అరుగుల దగ్గరకు లబ్ధిదారులను పిలుపించుకుని పింఛన్ల పంపిణీ చేపట్టినట్లు విమర్శలున్నాయి. ఈ నెలలో 7,018 మంది లబ్ధిదారులు ఉండగా, మొదటి రోజు 6,475 మందికి పింఛన్ పంపిణీ చేసినట్లు వెల్లడించారు.

కీళ్ల వ్యాధులకు నడకే మందు



వైద్య చికిత్సలందిస్తున్న డాక్టర్ హరిప్రసాద్ రెడ్డి

కర్నూలు (హాస్పిటల్): కీళ్ల నొప్పులతో బాధపడేవారికి నడకే మందు అని ఎముకలు, కీళ్ల వైద్య నిపుణులు డాక్టర్ వై.హరిప్రసాద్ రెడ్డి చెప్పారు. మంగళవారం స్థానిక జొహరాపురం రోడ్డులోని సాయిసత్య హాస్పిటల్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరానికి వచ్చిన వారికి ఎముకల సాంద్రత, ఎక్స్‌రే, బీపీ, షుగర్ పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. డాక్టర్ మాట్లాడుతూ.. కీళ్ల అరుగుదల ఉన్నవారు నేలపై కూర్చోరాదని, మెట్లు ఎక్కరాదన్నారు. కీళ్ల నొప్పులు, అరుగుదల ప్రాథమిక దశలో ఉన్నవారు నడక చేయాలని తద్వారా కండరాలు, ఎముకలు బలపడి అరుగుదల ఆగిపోతుందని చెప్పారు. నొప్పులు కూడా తగ్గుముఖం పడతాయన్నారు. శిబిరానికి వచ్చిన వారిలో 50 శాతం మంది కీళ్ల అరుగుదలతో బాధ పడుతున్నవారే ఉన్నారన్నారు. ఊబకాయం, వ్యాయామం లేకపోవడం, జీవనశైలి వల్ల త్వరగా కీళ్లు అరిగిపోతున్నట్లు తెలిపారు. కీళ్ల అరుగుదల 3, 4 దశల్లో ఉన్నవారికి కీళ్ల మార్పిడి ఉత్తమమైనదని, ఇప్పుడు అత్యాధునికంగా వచ్చిన రోబోటిక్ విధానం వల్ల కచ్చితమైన చికిత్స లభిస్తుందన్నారు.

పడకేసిన పారిశుద్ధ్యం



ఎస్సీ కాలనీ ప్రధాన రహదారిలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల వద్ద మురుగునీరు , చెత్తాచెదారం

కర్నూలు(రూరల్): గ్రామాల్లో పారిశుద్ధ్యం పడకేసింది. వీధులు మురుగుమయంగా మారాయి. జి. సిగవరంలో ఎస్సీ కాలనీలో ఏకంగా మురుగు ఇళ్లముందే నిలవడంతో దుర్గంధం వెదజల్లుతోంది. ఇదే పరిస్థితి కొనసాగితే తాము రోగాల బారిన పడాల్సి వస్తుందని వాపోతున్నారు. ఈ విషయాన్ని పలుమార్లు పంచాయతీ అధికారులు దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదు అని కాలనీ వాసులు అందోళన వ్యక్తం చేస్తున్నారు. కనీసం ఉన్నతాధికారులైనా స్పందించి గ్రామంలో పారిశుద్ధ్య పనులు మెరుగుపరచాలని కోరుతున్నారు.

ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు చర్యలు తీసుకోండి



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి టీజీ భరత్

కర్నూలు(సెంట్రల్): కర్నూలు నగరంలో అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని మంత్రి టీజీ భరత్ అధికారులను ఆదేశించారు. ఆయన మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ అతిథి గృహంలో జేసీ డాక్టర్ బి.నవ్య, ఆర్‌డీఓ సందీప్‌కుమార్, కర్నూలు తహసీల్దార్లు రమేష్‌బాబు, రవికుమార్, కల్లూరు తహసీల్దార్ ఆంజనేయులతో సమీక్షించారు. మంత్రి మాట్లాడుతూ.. పంపుహౌస్ సమీపంలోని గూడెం ప్రజలకు ఇళ్ల స్థలాలు ఇస్తామని మంత్రి లోకేష్ పాదయాత్రలో హామీ ఇచ్చారని, వారందరికీ స్థలాలు ఇవ్వాలన్నారు. బుధవారపేటలో నివాసం ఉంటున్న వారి వివరాలు తీసుకొని పట్టాల ఇవ్వాలన్నారు. 2014కు ముందు ఈ.తాండ్రపాడులో పట్టాలిచ్చినా ఇంత వరకు స్థలాలు చూపలేదని, వారి సమస్యను పరిష్కరించాలన్నారు.

వైద్య రంగానికే వన్నె తెచ్చిన బీసీ రాయ్



డాక్టర్ శంకరశర్మను సన్మానిస్తున్న జి.పుల్లారెడ్డి దంత కళాశాల వైద్యులు



మెడికవర్ హాస్పిటల్‌లో వైద్యుల వేషధారణలో చిన్నారులు

కర్నూలు(హాస్పిటల్): వైద్యసేవకే వన్నె తెచ్చిన డాక్టర్ బీసీ రాయ్‌ను జాతీయ వైద్యుల దినోత్సవం రోజున స్మరించుకోవడం అదృష్టమని గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ బి.శంకరశర్మ చెప్పారు. నగరంలోని జి.పుల్లారెడ్డి దంత వైద్య కళాశాలలో మంగళవారం జాతీయ వైద్యుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ శంకరశర్మ మాట్లాడుతూ.. బీసీ రాయ్ జన్మించిన రోజు, మరణించిన రోజు జులై 1 అని, ఆయన స్మారకార్థం వైద్యుల దినోత్సవంగా నిర్వహించాలని భారత ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఆయన పేరుపై వివిధ రూపాల్లో సేవలు అందించిన వారికి 1976 నుంచి అవార్డులు అందిస్తున్నారని తెలిపారు. వైద్య విద్యార్థులు వారి గురువులను గౌరవించాలని, రోగులతో మంచిగా మాట్లాడి వారికి చికిత్స అందించాలని సూచించారు. అనంతరం ఆయనను కళాశాల యాజమాన్యం ఘనంగా సన్మానించింది. కరెస్పాండెంట్ మురళీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

■ కర్నూలులోని మెడికవర్ హాస్పిటల్‌లో మంగళవారం చిన్నారులతో జాతీయ వైద్యుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. వైద్యుల సేవలను కొనియాడుతూ వక్తలు మాట్లాడారు.

■ లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు మెల్విన్ జోన్స్, నేషనల్ హ్యూమన్ రైట్స్ సోషల్ జస్టిస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్, బాలసాయి కంటి ఆసుపత్రుల సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం జాతీయ వైద్యుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. డాక్టర్లు జయప్రకాష్, ప్రభాకర్, రంగనాయకులు, బాలీశ్వరయ్యకు డాక్టర్ బీసీ రాయ్ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు ఇన్ హ్యూమానిటేరియన్ మెడికల్ సర్వీసెస్ అవార్డును అందజేశారు. అనంతరం గైనకాలజిస్టు ప్రత్యూష, జనరల్ సర్జన్ ప్రవీణ్, జనరల్ ఫిజీషియన్ రవితేజ, అనెస్తెటిస్ట్ జ్యోత్స్న, పీడియాట్రిస్ట్ విజయ్‌కుమార్‌ను సన్మానించారు.

■ జాతీయ వైద్యుల దినోత్సవం పురస్కరించుకుని మంగళవారం కిమ్స్ హాస్పిటల్ ఆధ్వర్యంలో వైద్యులు మొక్కలు నాటారు. హాస్పిటల్ సీఓఓ డాక్టర్ సునీల్ సేపూరి మాట్లాడుతూ పరిసరాలు బాగుంటేనే అందరూ ఆరోగ్యంగా ఉంటారన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

కల్లూరు: ఇంటి చుట్టూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మండల ప్రత్యేక అధికారి (సెట్కూరు సీఈఓ) వేణుగోపాల్ సూచించారు. మంగళవారం కొంగనపాడులో చెత్త సేకరణను పరిశీలించారు. తడి, పొడి చెత్తను వేర్వేరు బుట్టలలో ఉంచి పారిశుధ్య కార్మికులకు అందించాలన్నారు. అనంతరం గ్రామంలో లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నాగశేషచలా రెడ్డి పాల్గొన్నారు.

కార్లు ఢీ

పాణ్యం: మండల పరిధిలోని తమ్మరాజుపల్లె గ్రామం వద్ద మంగళవారం తెల్లవారుజామున రెండు కార్లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. కర్నూలు నుంచి నంద్యాల వైపు వెళ్తున్న కారును రాంగ్‌రూట్‌లో వెళ్తున్న మరో కారు ఢీకొంది. ప్రమాదంలో రెండు కార్లు దెబ్బతిన్నాయి. కానీ ఎవరికి గాయాలు కాలేదని హైవే పోలీసులు తెలిపారు.

వార్డెన్‌పై చర్యలు తీసుకోండి

కర్నూలు(అర్బన్): నగరంలోని ఎస్సీ కళాశాల బాలుర వసతి గృహం సంక్షేమాధికారిపై చర్యలు తీసుకోవాలని నవ్యాంధ్ర స్టూడెంట్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు అయ్యస్వామి, డీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు శరత్‌కుమార్ కోరారు. ఈ మేరకు మంగళవారం అమరావతిలో సాంఘిక సంక్షేమ శాఖ జేడీ జే.రంగలక్ష్మిదేవిని కలిసి వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ.. హాస్టల్‌లో విద్యార్థులకు మెనూ ప్రకారం టిఫిన్, భోజనాలు పెట్టడం లేదని, కనీసం కోడిగుడ్డు, అరటి పండు కూడా ఇవ్వడం లేదన్నారు. ఇదేమని అడిగితే కులం పేరుతో దూషిస్తున్నారని, సీనియర్ విద్యార్థులతో దాడులు చేయిస్తున్నారన్నారు. బయటి వ్యక్తులు కొందరు మద్యం సేవించి హాస్టల్‌కు వచ్చి విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. కొత్తగా అడ్మిషన్ కోసం వచ్చే విద్యార్థుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారన్నారు. తక్షణమే ఆయన్ను విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు.

మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రైవేట్‌కు అప్పగించొద్దు

కర్నూలు(సెంట్రల్): పాఠశాలలు, కళాశాలల్లో నిర్వహించే మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రైవేట్‌కు అప్పగించరాదని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జే.నాగేశ్వరరావు మంగళవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకాన్ని టాటా కంపెనీకి అప్పగించాలని చూస్తోందని, దాన్ని వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు.

కష్టపడి పనిచేసేవారికే పదవులు



కాటసాని రాంభూపాల్ రెడ్డిని సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

- వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్ రెడ్డి

కల్లూరు: కష్టపడి పనిచేసేవారికి తప్పనిసరిగా పదవులు వస్తాయని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. ఎస్‌ఎం బాషా వైఎస్సార్‌సీపీ మైనార్టీ సెల్ కర్నూలు జిల్లా సెక్రటరీగా, వెంకటస్వామి ఎస్టీ సెల్ సెక్రటరీగా, వి.శ్రీనివాసులు ఎస్సీ సెల్ సెక్రటరీగా నియమితులైన సందర్భంగా మంగళవారం వారు కాటసాని రాంభూపాల్ రెడ్డిని ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా కాటసాని రాంభూపాల్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర, జిల్లా, మండల విభాగాల్లో పదవులు పొందిన వారందరూ పార్టీ బలోపేతానికి మరింత కృషి చేయాలన్నారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు నరసింహులు, సాన శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ నాయకులు వీరేంద్ర, సుధాకర్ రెడ్డి, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈవ్‌టీజింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు



యువకులకు కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీసులు

కర్నూలు (టౌన్): ఈవ్ టీజింగ్, ఆకతాయి పనులకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసు అధికారులు స్పష్టం చేశారు. జిల్లాలోని ఆయా కళాశాలల వద్ద మంగళవారం యాంటీ ఈవ్ టీజింగ్ బీట్ తనిఖీలు నిర్వహించారు. ఈవ్ టీజింగ్, ఆకతాయిల వల్ల ఇబ్బందులు ఉన్నట్లయితే పోలీసుల దృష్టికి తీసుకు రావాలని విద్యార్థినీ, విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థినులపై అసభ్య ప్రవర్తనలను పూర్తిగా నియంత్రించాలన్న సంకల్పంతో వివిధ పాఠశాలలు, కళాశాలల వద్ద 36 ఈవ్ టీజింగ్ బీట్స్ విధులు ఏర్పాటు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. డ్రోన్ కెమెరాలు వినియోగిస్తున్నామని, జిల్లాలో ఇప్పటివరకు ఈవ్ టీజింగ్‌కు పాల్పడిన వారిపై నిఘా ఉంచి 17,467 మందిని స్టేషన్లకు తరలించి కౌన్సెలింగ్ ఇచ్చినట్లు వారు తెలిపారు.

నేనేమి చేశాను నేరం!

- కర్నూలు జీజీహెచ్‌లో దారుణం
- వీధి కుక్కల పాలైన పసికందు?



శిశువు మృతదేహానికి చీమలు, ఈగలు పట్టిన దృశ్యం

కర్నూలు(హాస్పిటల్):

పేగు బంధం తెంచుకుని పుట్టిన పసికందు లోకాన్ని చూడకుండానే మరణించి వీధి కుక్కల పాలైంది. సభ్య సమాజం తలదించుకునే ఈ ఘటన కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో చోటుచేసుకుంది. కారణం ఏదైనా, పొత్తిళ్లలోనే మరణించినా? అంత్యక్రియలకు నోచుకోకుండా వీధి కుక్కల పాలు కావడమేంటని. ఇంతటి దారుణానికి గురయ్యేందుకు 'నేనేమి చేశాను నేరం' అని సమాజాన్ని నిలదీస్తోంది.

ఆడపిల్లో లేక మరణించిన శిశువో తెలియదు గానీ ఆసుపత్రి న్యూ డయాగ్నోస్టిక్ సెంటర్ వద్ద చెత్తకుప్పలో శిశువు మృతదేహం కనిపించింది. మృతదేహానికి ఈగలు, చీమలు పట్టి ఉండటం, అక్కడున్న కుక్కలు దాన్ని పట్టుకునే ప్రయత్నం చేయడం మంగళవారం మధ్యాహ్నం ఆసుపత్రిలోని సద్గురుదత్త కృపాలయం నిర్వాహకుల కంట పడింది. వారు వెంటనే ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లును సంప్రదించి అనాథ శిశువు మృతదేహానికి అంత్యక్రియలు జరిపిస్తామని విన్నవించారు. అందుకు సంబంధించిన ఏర్పాట్లు చూడాలని హెల్త్ ఇన్‌స్పెక్టర్ కృష్ణమూర్తికి చెప్పి పంపించారు. ఆయన సిబ్బందితో కలిసి అక్కడికి వెళ్లగానే శిశువు మృతదేహం కనిపించలేదు. దానిని కుక్కలు తీసుకెళ్లిపోయి ఉంటాయని భావిస్తున్నారు. సాయంత్రం వరకు ఆసుపత్రి పరిసరాల్లో గాలించినా శిశువు మృతదేహానికి సంబంధించిన ఆనవాళ్లు కనిపించలేదు. మృతదేహం కనిపించిన వెంటనే ఆసుపత్రి సిబ్బంది కాపలాగా ఉండి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదని రోగుల సహాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. శిశువు మృతదేహాన్ని వీధికుక్కలు పీక్కుతిని ఉంటాయని భావిస్తున్నారు.

యోగాంధ్ర విజేతలకు సత్కారం



యోగా విజేతలను అభినందిస్తున్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా

కర్నూలు(సెంట్రల్): యోగాంధ్రలో జిల్లా స్థాయిలో విజేతలైన 19 మంది విద్యార్థులను జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా అభినందించారు. ఆయన మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో విజేతలను సత్కరించి సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ.. విద్యార్థులు దైనందిన జీవితంలో యోగాను భాగం చేసుకోవాలన్నారు. యోగా సాధన కోసం ప్రత్యేక సెంటర్‌ను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. నెల రోజులపాటు జరిగిన యోగాంధ్ర కార్యక్రమాల్లో చిన్నారులు ఇచ్చిన ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయన్నారు. జిల్లాస్థాయిలో వివిధ పోటీల్లో విద్యార్థులు ప్రతిభ కనబరచి రాష్ట్ర స్థాయి పోటీలోల ఎంపికై విజయవాడలో ప్రతిభను కనబరచడం అభినందనీయమన్నారు. జాతీయస్థాయి యోగాభూషణ్ అవార్డు గ్రహీతలైన యోగా గురువులు అవినాష్, డాక్టర్ ఎస్.ముంతాజ్‌బేగంను సన్మానించారు. సెట్కూరు సీఈఓ వేణుగోపాల్, జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి, డాక్టర్ ప్రసాదు, మునిస్వామి, జిల్లా యోగా సంఘం సభ్యులు గణేష్ పాల్గొన్నారు.

మైపర్‌లో గ్రాడ్యుయేషన్ డే



కోర్సు పూర్తయిన విద్యార్థికి పట్టా అందిస్తున్న డాక్టర్ దుర్గా ప్రసాద్‌రావు, తదితరులు

కర్నూలు సిటీ: మదర్ థెరిస్సా ఫార్మసీ కాలేజీలో మంగళవారం నాల్గవ గ్రాడ్యుయేషన్ డే ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జేఎన్‌టీయూ అకడమిక్ ఆడిట్ డైరెక్టర్ డాక్టర్ దుర్గా ప్రసాద్‌రావు, ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఈసీ మెంబర్, సెవెన్ హిల్స్ కాలేజీ ఆఫ్ ఫార్మసీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ నిరంజన్‌బాబు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ ఫార్మసీ విద్యకు మంచి భవిష్యత్తు ఉందన్నారు. ఫార్మసీ కోర్సు పూర్తి చేసుకున్న విద్యార్థులకు పట్టాలను అందజేసి అభినందనలు తెలిపారు. మైపర్ కాలేజీ డైరెక్టర్ డాక్టర్ ఆదిమూలపు సతీష్, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ స్టెల్లా సతీష్, ప్రిన్సిపాల్ మహాలక్ష్మీ, వైస్ ప్రిన్సిపాల్ కాకర్ల సురేష్, అకడమిక్ డీన్ రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.